# పంజా !

పేరు వామనరావ్ అన్న మాటేగానీ మనిషి ఆరడుగుల ఎత్తుంటాడు.

అలనాడెప్పుడో బి.ఎస్.ఆర్.బి. ఎక్జామ్ పాసై అతి కష్టం మీద గుమాస్తాగిరి కొట్టేశాడు. డిపార్ట్‌మెంట్లో టెస్ట్‌లు పాసై అదృష్టం కొద్దీ ఆఫీసరైనాడు.

అప్పుడే ప్రొబేషన్ ఆఫీసర్ పోస్ట్‌కి సెలక్ట్ అయివుంటే ఓ లక్ష రూపాయల కట్నమన్నా వచ్చివుండేది. ఇరవై ఏళ్లసర్వీసు పూర్తి అయిన తర్వాత బ్రాంచి మేనేజర్ పోస్టు వస్తే నేం? రాకపోతేనేం అన్పించింది వామనరావ్‌కి.

ఈ ఇరవైయ్యేళ్లలో పిల్లలు పుట్టకొచ్చారు. ఖర్చులు పెరిగాయి. సగం ముసలితనం దాపురించింది. వంట్లో శక్తీ సన్నగిల్లింది.

వెధవ వుద్యోగం. రొటీన్‌గా మెకానికల్‌గా తయారైంది. ఓ వెరైటీ లేదు రంజూ లేదు. జాబ్‌లో అనేసి తనను తాన తిట్టుకోని క్షణం లేదు.

ఒకప్పుడు బేంక్ మేనేజరంటే క్రింది స్టాఫ్‌లో గౌరవ మర్యాదలు, భయ భక్తులుండేవి. పబ్లిక్‌లో మంచి రెప్యుటేషనూ పలుకుబడికి కొదవ వుండేదికాదు.

ఇప్పుడదేం లేదు. అటెండర్ నుంచి ఆఫీసర్ వరకే అందరినీ ఒకే తాటిన కట్టేసి నట్టుంటుంది. డర్టీ జాబ్ గౌరవమా పాడా!

పాత రోజుల్లో బేంక్ వుద్యోగమంటే సినిమా హీరోకి వున్నంత గ్లామరుండేది! ఇప్పుడసలు ఆ ఎట్రాక్షన్ లేదు. అంతా సీదా సాదా అయిపోయింది. ఇదంతా కాలం తెచ్చిన మార్పు సుమాని బోలెడంత బాధపడిపోతూంటాడు వామనరావ్.

ఉదరపోషణార్థం బహుకృత వేషంలాగ ఉద్యోగం మానేసి ఖాళీగా ఇంట్లో కూర్చోలేం కదా! నెల జీతం కోసం వూడిగం చేయటం తప్పనిసరి!

బేంకులో బ్రాంచి మేనేజరంటే బాధ్యతలే తప్పించి దర్జాగా కాలు మీద కాలు వేసుకుని ఎ.సి. రూమ్‌లో కూర్చుని కాలాక్షేపం చేసే అదృష్టం వుండదు!

పైవాడి (బాసులు) అనుగ్రహం లేకనో... రూల్సు అతిక్రమించలేకనో... ఈ ఇరవైయ్యేళ్ల సర్వీసులో అరడజను వూళ్లన్నా తిరిగి వుంటాడు.

చాలా ఏళ్ల తర్వాత బ్రాంచి మేనేజర్‌గా రాష్ట్ర రాజధానిలో కొచ్చి పడ్డాడు వామనరావ్. సిటీ బతుకులో బొత్తిగా సుఖం లేదనే నిజం తెలిసినా రాక తప్పలేదు. జిల్లాల్లో లైఫ్

రిలాక్స్‌డ్‌గా వుంటుంది. అక్కడ అలవాటు పడిన వాడికి సిటీ లైఫ్ టెన్షనే!

ఆఫీసర్ పోస్ట్ కావటంతో 'నో' అన్లేక 'యస్' అని తలూపి వచ్చి పడ్డాడు.

అప్పటికీ ఏ విజయవాడో, గుంటూరో ఇమ్మని పైవాడి కాళ్ల మీద పడ్డా కనికరం కలగలేదు.

వారం వర్జ్యం వగైరాలు చూసుకుని మరీ బ్రెంచ్ మేనేజర్‌గా జాయినయ్యాను. సిద్ధాంతి గారు చెప్పిన ముహూర్తం వేళకి అరనిముషం అటు పావు నిముషం ఇటు పొల్లు పోకుండా తంచనుగ ఘడియలు విఘడియలు సైతం టాలీ చేసుకుని మరీ జాయినింగ్ రిపోర్టిచ్చాడు.

వామనరావ్ పాత కాలం మనిషేం కాదు. కాకపోతే... హిందూ ధర్మశాస్త్ర ప్రకారం తు.చ. తప్ప కుండా నడుచుకోవటం అతగాడి బలహీనత! అంతే దట్సాల్!!

సీతాఫల్ మండి బ్రాంచ్ మేనేజర్‌గ రిపోర్ట్ చేసిన మధుర క్షణాల్లో ఆఫీసర్ అయ్యామనే తన కలల పంట పండినందుకు తెగ సంబర పడ్డాడు.

చిక్కడపల్లిలో వున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి టెంపుల్ కెళ్లి స్వామిని దర్శించుకున్నాడు. అష్టోత్రం చేయించాడు. హుండీలో నూటొక్క రూపాయలు వేసి తృప్తి పడ్డాడు.

ప్రమోషనైతే వచ్చింది! రిపోర్టయితే చేసాడు. కానీ కొంప దొరకటం కష్టమైంది. టెంపరరీగా మిడిల్‌క్లాస్ లాడ్జీలో మకాం పెట్టాడు.

వామనరావ్‌కి సిటీ కొత్తేం కాదు. నాలుగైదు మెయిన్ సెంటర్లు కరతలామలకమే!

హైదరాబాద్ పనిమీద వచ్చినపుడు బంధువుల ఇంట్లో దిగేవాడు. సిటీ నాలుగు చెరగులూ చూడటానికి ఎప్పుడూ టైమ్ దొరికేడవలేదు. పనయ్యాక క్షణం వుండాలన్పించక పోవటంతో తిరుగు టపాలో తన వూరెళ్లి పోయేవాడు.

అప్పటికీ ఇప్పటికీ సిటీలో వూహించలేనంత మార్పేదో చోటు చేసుకున్నట్టన్పించింది. ఎక్కడ చూద్దామన్నా ఆకాశ హర్మ్యాలే! వాహనాల సందడి. దుకాణాల సముదాయాలు... పేవ్‌మెంట్ల ఆక్రమణలు. అమ్ముకునేవాళ్లు.. అడుక్కు తినేవాళ్లతో నిండి పోయింది ఇప్పుడు!

రాష్ట్ర రాజధానిలో కూడా తాగునీటికి కరెంట్ సప్లైకి కొరతే నన్న విషయం గ్రహించాడు. ఎండ వేడిమి దారుణంగా పెరిగింది. ఒకప్పుడు ఊటీలో లాగ వుండే చక్కటి వాతావరణం ఇప్పుడు కాలుష్య మయమైందనే నిజం తెల్సుకున్నాడు.

'సీతాఫల్ మండి' అనే పేరెలా వచ్చిందని ఒక రోజున తరచు బ్యాంకు కొచ్చే ఓ సీనియర్ సిటిజన్‌ని ప్రశ్నించాను.

తనకూ తెలీదంటూనే ఒక కహాని వినపించాడాయన. శ్రీరామచంద్రుడు తన భార్యని వెంటేసుకుని అరణ్య వాసం చేస్తున్న రోజుల్లో ఈ ప్రాంతమంతా సీతా ఫలాల వృక్షాలతో నిండి వుండటం గమనించిన మహాసాధ్వి భర్తని సీతాఫలాలు తెచ్చిమ్మని కోరిందట! సీతమ్మ

తల్లి సీతాఫలాలు ఆరగించిన చోటు కావటంతో దానికా పేరొచ్చి వుండవచ్చునంటూ చెప్పాడు.

నిజమైనా కాకపోయినా పెద్దాయన చెప్పిన 'స్టోరీ' ఆలకించి తలూపేడు వామనరావ్.

సీటీలో వుద్యోగం లాడ్జిలో మకాం ఇబ్బందిగానే వుంది. హోటల్ తిండి వంటికి పడిచావటం లేదు. కడుపు పాడవుతోంది. తుమ్ములు.. దగ్గు... ముక్కు దిబ్బడ వంటి కొత్త రోగాలు ఇబ్బంది పెడుతున్నాయ్.

మొత్తానికి ఓ రెండు గదుల పోర్షన్ దొరకటం గగనమైంది. అదీ బ్యాంక్ కి పాతిక మైళ్ల దూరంలో.

రోజూ సిటీ బస్సుల్లో రద్దీలో రావటం అసంభవంగ ఫీలైనాడు. ఆటోలో రోజూ ఇంటి నుండి బేంకుకి వచ్చి పోవాలంటే ఖర్చు అదిరిపోతోంది! స్కూటర్ కొని నడపాలంటే సిటీ ట్రాఫిక్ చూచి బెంబేలెత్తాడు. స్కూటర్ నడుపుతూ ఇంటికి క్షేమంగా చేరటం దుర్భరమన్పించింది. యాక్సిడెంట్ బారినపడి కాలో చెయ్యో విరిగితే ఇంతే సంగతులు. ఈ విధమైన శంకలన్నీ వామనరావ్‌ని ఝుడిపించినయ్!

ఇక సైకిలే శరణ్యం అనుకున్నాడు. అధవా సైకిల్‌కొని తొక్కాలి అంటే రోజూ ఆప్ అండ్ డౌన వెరసి యాభై కిలోమీటర్లు సైక్లింగ్ చేయటమంటే మాటలా?

ఎలా ఈ ధర్మ సంకటంలోంచి బైట పడటమాని సుదీర్ఘంగా ఆలోచించిన వామనరావ్.. అద్దె ఎక్కువైనా సరే బేంక్‌కి దగ్గర్లో ఇల్లు తీసుకోవటానికే నిర్ణయంచుకున్నాడు.

అదట్లా వుండగా... లాంగ్వేజ్ ప్రాబ్లమొకటి! తనకా హిందీ వచ్చేడవదు. చిన్నప్పుడు... హిందీ చదివి పరీక్షలు పాసై ఏడవరాని తండ్రి చెవి మెలేసినా హిందీ అంటేనే ఎలర్జీ ఫీలయ్యేవాడు. అంచేత దాని జోలికే పోలేదు.

అప్పటి నిర్లక్ష్యం ఇప్పుడు ప్రాబ్లమైంది!.

★★★★★

బాంకింగ్ రంగంలో అనేకానేక పరిణామాలు చోటు చేసుకుంటున్న దరిమిలా... లోన్లు ఇచ్చే సదుపాయం ఏర్పడ్డది! ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎవరికి పడితే వారికి ఎంత కావాలంటే అంత అనేక రకాల లోను కార్యక్రమాలు వెలుగు చూచినయ్!

హౌస్‌లోను... కారులోను... చదువుకు లోను.. వ్యాపారానికి లోను... ఇట్లా ఎన్నో ఎన్నెన్నో!

పని చేసే వారి సంఖ్య పెరగకపోగా... విపరీతంగా పని భారం మాత్రం బ్రహ్మరాక్షసిలాగా పెరిగింది.

కంప్యూటర్లు రంగ ప్రవేశం చేసినా... మేన్యూవల్ వర్క్ బోలెడంత వుండి ఏడ్చింది.

అప్పులిస్తూ పోవడం జరుగుతోంది. కాని తీసుకున్న అప్పు సజావుగా తీర్చే వాళ్లసంఖ్యే

'పూర్'గా వుంది.

మేనేజరుద్యోగం సజావుగా చేయగలనాలేదానే భయంపట్టుకుంది  వామనరావ్‌కి.

అప్పు పుచ్చుకునే ప్రక్రియ సులభ తరమైనా.. తిరిగి చెల్లింపు పర్సంటేజి బహుస్వల్పంగా వుంటుంన్నందున అధికారులతో తిట్లు తినాల్సి వస్తోంది.

అప్పు వసూళ్లు నావల్లకాదు మహాప్రభో అంటూ కాళ్లబార చాపేడు వామనరావ్. ఆల్మోస్ట్ మిగతా బ్రాంచీలది కూడా ఇదే పరిస్థితి.

లోన్ 'ఫెసిలిటీ ప్రజల పాలిటి వర ప్రసాదమైనా... మేనేజర్లకి మాత్రం పిల్లికి చెలగాటం ఎలక్కు ప్రాణసంకటంలా తయారైంది.

తీసుకున్న లోను వాయిదాలు తీర్చలేక అనేకానేక కారణాలు వల్లిస్తున్నారు ఖాతాధారులు.

మొండి బాకీ వసూళ్ల సంగతి మేనేజ్‌మెంట్‌కి ఓ పెద్ద సమస్యలా తయారైంది.

మేనేజర్లంతా తమ కష్టాలను ఆఫీసర్స్ అసోసియేషన్ వారికి విన్నవించుకున్నారు. తమ గోడు పట్టించుకోకపోతే మూకుమ్మడిగా వి.ఆర్.ఎస్. తీసుకుంటామనీ బెదిరించాల్సి రావటంతో ... సుదీర్ఘ చర్చల అనంతరం టాప్ మేనేజ్‌మెంట్ ప్రాబ్లం అర్థం చేసుకుని మెట్టు దిగొచ్చింది.

వామనరావ్‌కి కంటి నిండా నిద్ర కరువయ్యింది. వేళకి భోజనం చేయగలిగే స్థితిలో లేడు. ఓవర్‌టైమ్ చేయాల్సి వస్తోంది. లేటు భోజనం వల్ల 'ఆసిడిటీ' సంక్రమించింది. పని భారం మూలాన బి.పి. పెరిగి ఆరోగ్యం శృతి తప్పుతున్న తరుణంలో...

ఒక రోజు ఫాక్స్ మేసేజ్ వచ్చిందీ.

సర్క్యులర్ ఫారమ్‌లో వున్న మేసేజ్ చదివిన మరుక్షణమే గుండెల మీద బరువు తగ్గినట్టన్పించింది. హమ్మయ్య అనేసి ఊపిరి పీల్చుకున్నాడు. టెన్షన్ దూరమై నట్టన్పించింది వామనరావ్‌కి!

సర్క్యులర్ సారాంశం ఏమిటయ్యా అంటే?

మొండి అప్పుల రికవరీ విషయంలో ప్రత్యేకమైన వ్యక్తుల నియామకం జరుగుతోందని... ఒక్కో బ్రాంచీకి నలుగురైదుగురు కేటాయింపబడతారనీ... వసూళ్ల బాధ్యత సంపూర్ణంగా వారిపైనే వుంటుందనీ... వారికి కన్సాలిడేటెడ్ సాలరీ వుంటుందనీ... దాన్ని వారికి బ్రాంచిమేనేజరే ఏర్పాటు చేయాలనీన్నూ... వగైరా వగైరా... వివరాలున్నాయ్ ఆ సర్క్యూలర్ మేసేజ్‌లో!

పరమానంద భరితుడైన వామనరావ్ సంతోషం పట్టలేక తన ఛేంబర్లో గంతులేశాడు. కావున తన వుద్యోగాని కొచ్చిన ముప్పేమీ వుండదనే నిర్ణయానికొచ్చాడు.

★★★★★

రికవరీ ఏజంట్లు డ్యూటీకి రిపోర్ట్ చేయగానే డిఫాల్టర్స్ లిస్ట్ కంప్యూటర్లో తీసి వారికి అందించాడు వామనరావ్!

ఇంకేముంది? లిస్ట్‌లు చేతిలో పట్టుకుని బాకీ తీర్చని వాళ్ల ఇళ్ల మీద దాడి చేసారు ఏజంట్లు.

ఋణ గ్రహీతలకు ఆ వచ్చిన వాళ్లు రికవరీ ఏజంట్లుగా అవుపించలేదు. రాక్షసుల్లా కన్పించారు.

అప్పు తీర్చని వాళ్లని నోటికొచ్చినట్టల్లా తిట్టారు. వాళ్లపై చేయి చేసుకున్నారు. ఇంట్లో సామాను వీధిలోకి గిరవాటేసారు.

ఏజంట్ల అకృత్యాలకు తట్టు కోలేక వీధిన పడ్డ వాళ్ళ బ్రతుకలు చూచి బావురు మన్నారు. ఆడ మగ పిల్లా పెద్దా వారిని ప్రతిఘటించలేక లబోదిబో మన్నారు.

తమ పరువు పోయినందుకు రోదించారు. బాకీ వసూళ్ల విధానం రౌడీయిజాన్ని తలపిస్తోందని ఏజెంట్ల పేరుతో గూండాలను రౌడీలను నియమించారని... వీళ్ల అనుచిత చర్యకు అప్పుపుచ్చుకున్న వారు బెంబేలెత్తి భయభ్రాంతులవుతున్నారనీ... అవమాన భారంతో ఆత్మహత్యలకు పూనుకుంటున్నారనీ...పేపర్లన్నీ ఘోషించినయ్.

ఈ సమస్యను ప్రజా ప్రతినిధులు ఆపోజిషన్ వారు అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో ప్రస్తావించి గలభా చేసి చివరికి వాకౌట్ కూడా చేయటం జరిగింది.

బాధితుల్లో కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించారు.

అయినా రికవరీ ప్రాసెస్ రాక్షసగణమైన ఏజంట్లనబడే గూండాల ద్వారా కొనసాగుతూనే వుంది. వీరు పంజా విసురుతూనే వున్నారు. బాధితులకు రక్షణ కరవైంది!

వామనరావ్‌కి మాత్రం వర్రీ లేకుండా పోయింది. తన ప్రాబ్లమ్ సొల్యూషన్ దొరికినందుకు సంతోషించాడు.

-:(సమాప్తం):-